

ఏడాది సంబరం

అనంతపురం అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం శ్రేణులు జిల్లావ్యాప్తంగా సంబరాలు చేసుకున్నాయి. కేక్‌లు కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాజీ మేయర్ స్వరూప, తెలుగు మహిళలు విశాలాక్షి, సరళ, లక్ష్మీనాయుడమ్మ తదితరులు కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు.

పరామర్శ.. పన్నాగం..!

- అరాచకానికి వైసీపీ కుట్ర..!
- పేరూరులో బల ప్రదర్శనకు ఎత్తుగడ
- భద్రతావైఫల్యంగా చిత్రీకరించే ప్రయత్నం
- పోలీసులపై మేరుగ రుసరుస
- బాధితురాలు ఆస్పత్రిలో ఉంటే.. 'చలో పేరూరు' ఎందుకో..?



పుట్టపర్తి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రతి విషయంలోనూ అల్లర్లు, అరాచకానికి కుట్ర పన్నుతోంది. బాలికపై అత్యాచారం విషయంలోనూ ఇదే పన్నాగం పన్నిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కుంటిమద్ది హెలీకాప్టర్ ఘటన మరువక మునుపే రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ మరోమారు పరామర్శల పేరుతో రాజకీయ కుట్రకు తెరలేపింది. బాలిక అత్యాచారం ఘటనలో ప్రమేయం ఉన్న నిందుతులను పోలీసులు అరెస్టు చేసినా 'చలో పేరూరు' అంటూ వైసీపీ శ్రేణులు గురువారం బల ప్రదర్శన ప్రయత్నం చేశాయి. ఇటీవల రామగిరి మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఆ మేరకు అత్యాచారం కేసులో ప్రమేయం ఉన్న 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సున్నితమైన ఈ ఘటన విషయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించినా వైసీపీ నాయకులు రాజకీయ (మిగతా 7వ పేజీలో...)

మద్దతు ధరలతో ఊరట

ఖరీఫ్ నుంచి కొత్త ధరలు

మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2,400
కందులకు రూ. 8వేలు
రాగికి రూ. 4,886
వేరుశనగకు రూ.7,263



మొక్కజొన్న పంట

హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు

చిలమత్తూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పండించిన పంటకు సరైన ధరలు లభించక నష్టాలకు గురవుతున్న రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రధానంగా మొక్కజొన్న, కంది, రాగి, వేరుశనగ పంటలకు మద్దతు ధరలను పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పెట్టుబడులు పెట్టి పంట చేతికందిన తరువాత గిట్టుబాటు లేక దళారుల చేతుల్లో మోసపోతున్న రైతులకు పెంచిన ప్రభుత్వ మద్దతు ధరలు ఎంతో లాభదాయకంగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో గిట్టుబాటు ధరలు లేక, పండిన పంటను సరైన ధరలకు అమ్ముకోలేక నానా ఇబ్బందులు పడ్డారు. పెంచిన మద్దతు ధరలు ఈ ఖరీఫ్ నుంచి అమల్లోకి రానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ తరుణంలో మంచి గిట్టుబాటు ధర కలిగిన మొక్కజొన్న, రాగి, కంది పంటలపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు సలహా ఇస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వేరుశనగ పంట పండిస్తున్నారని, ఆ పంటకు కొంత విరామం ఇచ్చి మిగిలిన పంటలను సాగుచేసుకుంటే అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

పెరిగిన మద్దతు ధరలు

తీవ్ర నష్టాలకు గురవుతున్న రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం పండిన పంటలకు మద్దతు ధరలు ప్రకటించింది. మొక్కజొన్న పంట క్వింటాలుకు రూ. 2,400, రాగి పంటకు రూ. 4,886, కందులుకు రూ. 8 వేలు, వేరుశనగ క్వింటాలుకు రూ. 7,263 గా ప్రభుత్వం ప్రకటించింది. గతంతో పోల్చితే ఈ ఏడాది మద్దతు (మిగతా 6వ పేజీలో...)

పోలీసు పైసా వసూల్..!

- శెట్టూరులో బండి ఆగాల్సిందే... కప్పం కట్టాల్సిందే..
- కూరగాయల లోడ్లనూ వదలని దుస్థితి



శెట్టూరు పోలీసు స్టేషన్

శెట్టూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దులో పోలీసులు అక్రమ వసూళ్లకు తెగబడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శెట్టూరు మీదుగా ఏ లోడు వాహనం వెళ్లాలన్నా.. కాసులు ఇచ్చుకోవాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు. పోలీసు స్టేషన్ వద్ద ఆపి.. కప్పం కట్టాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శెట్టూరు మీదుగా కర్ణాటక ప్రాంతానికి అరటి, వేరుశనగ, మొక్కజొన్న, మిర్చి తదితరాలను రోజూ వాహనాల్లో తరలిస్తుంటారు. శెట్టూరులో పోలీసులు ఆపి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భోజనం ఖర్చులకు తెచ్చుకున్న డబ్బు పోలీసులకు ఇచ్చి, తాము పస్తులుండాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు. డబ్బుల్లేవు అంటే.. రికార్డుల తనిఖీ పేరుతో దుర్భాషలాడతారని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల మామిడికాయల లోడును ఆపి, డబ్బు ల్లేవంటే కాయలు దింపాల్సిందేనంటూ హుకుం జారీ చేశారట. ఈనెల 7వ తేదీన కళ్యాణదుర్గం వైపు నుంచి ఓ లోడు లారీ రాగా.. శెట్టూరు వైపు నుంచి పోలీసు వాహనం ఎదురుగా వచ్చింది. ఆ లారీ డ్రైవర్ వద్ద నుంచి నిర్దాక్షిణ్యంగా డబ్బు వసూలు చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాయగూరల వాహనాల నుంచి సైతం వసూలు చేస్తున్నారని డ్రైవర్లు వాపోతున్నారు. దీనిపై జిల్లా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

విచారించి, చర్యలు చేపడతాం

శెట్టూరు వసూళ్ల విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై విచారంచి, చర్యలు చేపడతాం.

-నీలకంఠేశ్వర్, సీఐ,
కళ్యాణదుర్గం రూరల్

ఇసుక కోసం..
నదీ గర్భంలో
గోతులు తవ్వుతున్నారు..
పెద్దపెద్ద రోడ్లు వేసి..
పేలికలు చేస్తున్నారు..

అష్టాదాన్ని పంచే నదిని..
కళావిహీనంగా మార్చేశారు..
చిత్రావతిని చిత్రహింసలు
పెడుతున్నారు..

యల్లనూరు కాజ్‌వే వద్ద చిత్రావతి నదిలో పక్కపక్కనే వేసిన రోడ్లు



చిత్రహింసలు..!


చిత్రావతిలో యథేచ్ఛగా
ఇసుక తవ్వకాలు

వాహనాలు వెళ్లేందుకు
రోడ్ల నిర్మాణం

కళతప్పిన నది

కాజ్‌వేలకు ముప్పు

లక్షుంపల్లి వద్ద నది మధ్యలో ఏర్పాటుచేసిన రహదారి



ఇసుకాసురులు చిత్రావతి నదిని ఛిద్రం చేస్తున్నారు. ఒకప్పుడు చూడచక్కగా ఉండే నది నేడు రహదారుల ఏర్పాటు, ఆక్రమణలతో రూపురేఖలు మారి కళతప్పింది. మండల పరిధిలో చిత్రావతి సుమారు 15 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఇసుకాసురుల కన్ను నదిపై పడింది. ఇసుకను తరలిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇసుక తరలింపు కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీలు సులువుగా నదిలో నుంచి బయటకు వచ్చేందుకు ఏకంగా రోడ్లు వేసుకుంటున్నారు. ఈ రహదారుల గుండా రాత్రింబవళ్లు ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ స్థాయిలో అక్రమ ఇసుక రవాణా సాగుతున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

- ఆంధ్రజ్యోతి, యల్లనూరు

రీచ్‌లకు పర్మిషన్ ఇవ్వడంతోనే..

ప్రభుత్వం పదేళ్లుగా ప్రైవేటు, ప్రభుత్వ స్థలాల్లో ఇసుక తరలించడానికి విరివిగా అనుమతులు ఇవ్వడంతో ఎక్కడ పడితే అక్కడ నదిలో మట్టితో రహదారులను నిర్మిస్తున్నారు. రీచ్‌కాలం ముగిసిన వెంటనే రహదారి కోసం ఏర్పాటుచేసిన మట్టిని బయటకు తరలించాలి. దానిని అలానే వదిలేస్తున్నారు. ఈ రోడ్లు ఇసుక అక్రమ రవాణాకు అనువుగా మారుతున్నాయి.

ముప్పు అంచున కాజ్‌వేలు

ప్రధాన రహదారుల్లో చిత్రావతి నదిపై రెండుచోట్ల కాజ్‌వేలు ఉన్నాయి. ఈ కాజ్‌వేలకు దిగువప్రాంతంలో రీచ్‌లు ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం నది ఉధృతంగా ప్రవహించింది. ఆ సమయంలో నీరు నదిలో సజావుగా ప్రవహించకుండా రహదారులు ఉన్నచోట ఒక్కసారిగా కాజ్‌వేపైకి వచ్చింది. దీంతో శింగవరం, యల్లనూరు కాజ్‌వేలు కొట్టుకుపోయాయి.

ఈ సమయంలో యల్లనూరు నుంచి తాడిపత్రి, తిమ్మంపల్లి, పులివెందుల ఆర్‌అండ్‌బీ రహదారిపై రాకపోకలు నెలరోజులపాటు నిలిచిపోయాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని, అప్పట్లో రూ.2కోట్ల వ్యయంతో రహదారిపై కాజ్‌వేలకు మరమ్మతులు చేశారు.

పక్కపక్కనే రెండు రహదారులు

మండలకేంద్రం సమీపాన చిత్రావతి నదిలో రెండుచోట్ల ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఇసుక తరలింపుకోసం ఇద్దరు వ్యక్తులు పక్కపక్కనే బెలుకు మట్టితో రోడ్లు వేశారు. ఒకేచోట రెండురీచ్‌లు ఉన్నా.. ఒక రహదారిపై మరొకరు వెళ్లకూడదని టిప్పర్ల ద్వారా మట్టిని తీసుకువచ్చి రహదారులను నిర్మిస్తున్నారు. ప్రైవేటు స్థలాల్లో ఇసుక తరలించడానికి అనుమతులు ఉన్నా నదిలో రహదారులను నిర్మించడానికి ఎవరు అనుమతి ఇచ్చారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నది పరీవాహక ప్రాంతాల్లోని పండ్లతోటలకు నదిలో నుంచి పైపులైన్ ఏర్పాటుచేస్తున్నారు. వీటిపై రహదారులు నిర్మించి భారీ వాహనాలు వెళితే పైపులైన్‌ను పగిలిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలకేంద్రంలో జోరుగా ఇసుక రవాణా సాగుతున్నా.. నదిలో రోడ్లు వేస్తున్నా.. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. మండలకేంద్రంలో పనిచేసే అధికారులు తాడిపత్రిలో నివాసం ఉంటూ రాకపోకలు సాగిస్తుంటారు. రోజూ రాకపోకలు సాగించాలంటే నది దాటాల్సిందే. ఆ సమయంలో నదిలో రోడ్లు పనులు అధికారులకు కనిపించడం లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇక సచివాలయ ఉద్యోగుల వంతు..

- బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- నెలాఖరులోపు పూర్తి చేయాలని ఉత్తర్వులు

7

అక్రమాల ఆట..!

ఆడుదాం ఆంధ్రా.. అవినీతిమయం..

రూ.70లక్షలకు పైగా దుర్వినియోగం

విజిలెన్స్ విచారణతో
అక్రమార్కుల్లో అలజడి





నార్పల స్టేడియంలోని గదిలో ఉంచిన ఆడుదాం ఆంధ్రా కిట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆడుదాం.. ఆంధ్రా.. పోటీలు నిధులు బొక్కేసేందుకే నిర్వహించారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. నాలుగేళ్లు క్రీడలను గాలికొదిలేసిన గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆడుదాం ఆంధ్రా అంటూ నిధులు దోచేసే ఎత్తు వేసింది. క్రీడలంటే తెలియని వారికి పోటీలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కూడా పాల్గొన్నారు. వారికి నీరు కూడా ఇవ్వలేదు. ఏకంగా భోజనాలే పెట్టినట్లు బిల్లులు భోంచేశారు. క్రీడాకిట్ల నాణ్యత గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. నాసిరకమైన వాటిని సరఫరా చేశారు. ఇలా.. (మిగతా 6వ పేజీలో..)

రాయదుర్గం ప్రగతి నివేదిక విడుదల

- స్పీకర్ చేతుల మీదుగా కరపత్రాల ఆవిష్కరణ

రాయదుర్గం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా రాయదుర్గం నియోజకవర్గ ప్రగతి నివేదికను గురువారం అమరావతిలోని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా విడుదల చేశారు. ఆయన చాంబర్‌లో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుతో పాటు వైజాగ్ సౌత్ ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవితో కలిసి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి నివేదికను విడుదల చేశారు. ప్రధానంగా తొలి ఏడాది సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి రూ.35 కోట్లతో తుంగభద్ర ఎగువకాలువ మరమ్మతు పనులను చేపట్టారు. భైరవానతిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాల తరలింపు ప్రక్రియ వేగవంతం, ఆవులదట్ల బ్రాంచ్ కాలువ ద్వారా 10 వేల ఎకరాలకు, మాల్యం బ్రాంచ్ కాలువ ద్వారా 25 వేల ఎకరాలకు సాగునీరు అందించే పనులకు సీఎం చంద్రబాబు ఆమోదముద్ర వేసినట్లు వెల్లడించారు. ఉంతకల్లు రిజర్వాయర్‌కు డీపీఆర్ తయారీ, 67 చెరువులకు నీరందించే పథకానికి నివేదికను సిద్ధం చేయించారు. రెండు ప్రధాన రైల్వే బ్రిడ్జిల నిర్మాణానికి రైల్వేశాఖ అనుమతులు సాధించడం, 7500 మెగావాట్ల సామర్థ్యం సెంట్రల్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇలాంటి అనేక కార్యక్రమాలకు సంబంధించి ప్రగతి నివేదికను సిద్ధం చేసి విడుదల చేసినట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు.



ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న స్పీకర్ అయ్యన్న, ప్రభుత్వ విప్ కాలవ తదితరులు

టెన్త్ సప్లిమెంటరీలో 76.29 శాతం ఉత్తీర్ణత

అనంతపురం విద్య, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో 76.29 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలకు 9,445 మంది హాజరు కాగా 7,206 మంది పాసయ్యారు. గతనెల 19 నుంచి 28 వరకూ నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. బాలురు 5,771 మంది పరీక్షలకు హాజరు కాగా 4231 మంది పాస్ అయ్యారు. బాలికలు 3674 మంది హాజరుకాగా 2975 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురులో 73.51 శాతం, బాలికల్లో 80.97 శాతం ఉత్తీర్ణత వచ్చింది. రీకౌంటింగ్ కోరుకునే విద్యార్థులు రూ.500, రీ వెరిఫికేషన్ కోరుకునే విద్యార్థులు 1000 చెల్లించాల్సి ఉంటుంది. ఈనెల 13 నుంచి 19లోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.



గోవిందవాడ వద్ద నీట మునిగిన వేరుశనగ పంట

దంచికొట్టిన వాన

పొంగిపొర్లిన వాగులు, వంకలు
లోతట్టు ప్రాంతాలు జలమయం
నీట మునిగిన పంట పొలాలు

(6లో...)

తొలిరోజు తడబాటు..!

తెరుచుకున్న పాఠశాలలు
ఉదయం జోరు వర్షం

పెద్దగా హాజరుకాని విద్యార్థులు
నామమాత్రంగా పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

6



బుక్కరాయసముద్రం పాఠశాలలో తరగతి గదిలోకి వెళ్తున్న విద్యార్థినులు


అనంతపురం నగరంలో వర్షపు నీటిలో పాఠశాల, కళాశాలకు వెళుతూ..


బుక్కరాయసముద్రం పాఠశాలలో యూనిఫాం తీసుకుని వెళ్తున్న విద్యార్థులు


తొలిరోజు హాజరైన విద్యార్థులు

తెరుచుకున్న పాఠశాలలు
ఉదయం జోరు వర్షం
పెద్దగా హాజరుకాని విద్యార్థులు
నామమాత్రంగా పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

తొలిరోజు తడబాటు..!






నంబర్ 2 పాఠశాలలో అడ్మిషన్లు తీసుకుంటున్న ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం చేస్తూ..

అనంతపురం విద్య, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల తర్వాత గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడం, ఉదయం పాఠశాలలకు వెళ్లే సమయంలో వర్షం పడటంతో విద్యార్థులు మందకొడిగా హాజరయ్యారు. కొన్ని పాఠశాలలకు 10 నుంచి నుంచి 20 శాతం కూడా విద్యార్థులు హాజరు కాలేదు. కొన్నిచోట్ల తరగతి గదులు వెలవెలబోయాయి. తొలిరోజే విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. కొన్ని స్కూళ్లలో నామమాత్రంగా, చాలా చోట్ల పంపిణీనే జరగలేదు. పుస్తకాలు, యూనిఫాం మాత్రమే పంపిణీ చేశారు.


అనంతపురం రూరల్ పాఠశాలలో తక్కువగా హాజరైన పిల్లలు

మొదటి రోజు నామమాత్రంగా..

సెలవుల తర్వాత స్కూళ్లు తెరుచుకోవడంతో ఒక వైపు వర్షం పడుతున్నా.. కొందరు పిల్లల బడికి వెళ్లారు. హాస్టళ్లలో ఉంటూ చదివే పిల్లలు పెట్టెలు, ఇతర లగేజీలు తీసుకుని తల్లిదండ్రులతో కలసి చేరుకుంటూ కనిపించారు. చాలా స్కూళ్లలో హాజరు పెద్దగా కనిపించలేదు. మొదటి రోజు కావడం, శని, ఆది వారాలు మళ్లీ సెలవులు కావడంతో చాలా మంది తల్లిదండ్రులు స్కూళ్లకు పంపడానికి ఆసక్తి చూపలేదు. ఫలితంగా విద్యార్థులు లేక చాలా ప్రాంతాల్లో పాఠశాలలు వెలవెలబోయాయి. పాఠశాలల పరిసరాలను సిబ్బంది శుభ్రం చేస్తూ కనిపించారు. మొదటి రోజు కొత్త అడ్మిషన్లు, టీసీల జారీతోపాటు, పిల్లలు తక్కువగా రావడంతో కిట్ల పంపిణీ పెద్దగా జరగలేదు.


తక్కువ సంఖ్యలో హాజరైన విద్యార్థులు


నంబర్ 2 స్కూల్‌లో వాలీబాల్ ఆడుతూ...



దంచికొట్టిన వాన


కొళగానహళ్లి గ్రామం వద్ద వరదనీటితో పారుతున్న కబ్బాలివంక

పొంగిపొర్లిన వాగులు, వంకలు
లోతట్టు ప్రాంతాలు జలమయం
నీట మునిగిన పంట పొలాలు

బొమ్మనహాళ్/విడపనకల్లు/ఉరవకొండ/కణేకల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ బోరుబావుల కింద పత్తి, వేరుశనగ తదితర పంటలను రైతులు సాగు చేశారు. మండలంలోని కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కొళగానహళ్లి గ్రామం వద్ద కబ్బాలివంకకు భారీగా వరదనీరు రావడంతో పొంగిపొర్లుతోంది. గాలి, వాన ఉధృతికి చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకొరిగి విద్యుత్‌వైర్లు కిందకు వేలాడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గోవిందవాడ గ్రామ పరిధిలో ఇసుక పొలాల్లో సాగుచేసిన వేరుశనగ పంట దాదాపు 70 ఎకరాల్లో నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లింగదహాళ్, రంగాపురంక్యాంపు, ఉప్పరహాళ్, సింగానహళ్లి తదితర గ్రామాలలో పత్తిపంట నీట మునిగింది. తెరిపిలేకుండా వానలు కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

విడపనకల్లు మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పొలికి-అంచనహాలు, గడేకల్లు-ఆర్ కొట్టాల, పాల్తూరు-కళవల్లితిప్ప, ఉండబండ-ఉరవకొండ దారుల్లోని వంకలు పొంగి పొర్లటంతో మధ్యాహ్నం వరకూ రాక పోకలు నిలిచిపోయాయి.


విడపనకల్లులోని ఎస్‌డబ్ల్యూ పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు

విడపనకల్లు గ్రామంలోని ఎస్‌డబ్ల్యూ పాఠశాలలోకి వర్షపు నీరు చేరడంతో ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడి కేంద్రంలోకి వర్షపు నీరు చేరింది. భారీ వర్షం రావటంతో ఊరి చివర ఉన్న పెద్దాసుపత్రికి వెళ్లే దారి జలమయం అయ్యింది. ఈ దారిలో ఆసుపత్రికి వెళ్లే రోగులు, వైద్య సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మండలంలో 91.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉరవకొండలో భారీ వర్షం

ఉరవకొండ పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. 40మి.మీల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భారీ వర్షానికి పాత బస్టాండ్‌లోని క్లాక్‌టవర్ కూడలిలో వర్షపు నీరు నిలబడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శివారు ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు చేరడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొలాలు చెరువులను తలపించాయి.

తెగిన రహదారి

కణేకల్లు మండలంలోని మీండ్లపల్లి-గరుడచేడు మధ్య ఉన్న రహదారి బుధవారం రాత్రి కురిసిన వర్షానికి తెగింది. ఈ దారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా, అనుబంధంగా ఉన్న కల్వర్టు, రహదారి రెండూ వర్షం వల్ల తెగిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. కణేకల్లు క్రాసింగ్‌తోపాటు పలు ప్రాంతాలలో స్తంభాలు ఒరగడంతో విద్యుత్ సమస్యలు ఏర్పడ్డాయి.


మీండ్లపల్లి, గరుడచేడు మధ్య తెగిన రహదారి

లక్షణాలు ఉంటే కరోనా పరీక్షలు

ప్రత్యేక కొవిడ్ వార్డు ఏర్పాటు

● ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు



అనంతపురం టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కరోనా కేసులు జిల్లాలో మళ్లీ పెరుగుతున్నాయి. అనుమానిత లక్షణాలతో వస్తున్న వారికి పరీక్షలు చేస్తుండగా పాజిటివ్ వస్తోంది. ఇప్పటికే వరుసగా జిల్లా ఆసుపత్రిలో పరీక్షలు చేసిన వారిలో ఐదుగురికి పాజిటివ్ నిర్ధారణ అయింది. ఆసుపత్రిలో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆసుపత్రిలో తీసుకుంటున్న చర్యలు గురించి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు పలు విషయాలను వెల్లడించారు.

ఇంటర్వ్యూ

ప్రశ్న : కరోనా పరీక్షలు ఎంతమందికి చేశారు..?
జవాబు : కరోనా ప్రభావం మళ్లీ రావడంతో అనుమానిత లక్షణాలతో ఆసుపత్రికి వచ్చే వారికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. గత 15 రోజులుగా ఈ పరీక్షలు చేస్తున్నాం. ఇప్పటికి 37 మందికి పరీక్షలు చేయగా.. ఐదుగురికి పాజిటివ్ వచ్చింది.
ప్రశ్న : కరోనా బాధితులకు చికిత్సలు ఎక్కడ అందిస్తున్నారు..?
జవాబు : జిల్లా సర్వజన ఆసుపత్రిలో కరోనా బాధితులకు అవసరమైన వైద్యం అందించడానికి ఏర్పాట్లు సిద్ధం చేశాం. 48 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశాం. ఆ విభాగానికి డాక్టర్లు, సిబ్బందిని నియమించాం. కోఆర్డినేటర్‌గా డాక్టర్ రమేష్‌ను నియమించాం.
ప్రశ్న : మందులు, మాస్కులు, ఇతర పరికరాలు ఉన్నాయా..?
జవాబు : కరోనా బాధితులకు అవసరమైన మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికి ఐదుగురికి పాజిటివ్‌రాగా.. ఇందులో ముగ్గురు హోమ్‌ఐసోలేషన్‌లో ఉంటున్నారు. మరో ఇద్దరు జిల్లా ఆసుపత్రిలోని ప్రత్యేక వార్డులో చికిత్స తీసుకుంటున్నారు. అవసరమైన మందులు ఉన్నాయి. మాస్కులు, శానిటైజర్, గ్లౌజులకు ఇండెంట్ పెట్టాం.
ప్రశ్న : కరోనా నియంత్రణకు ఏమి చేయాలి..?
జవాబు : ప్రతి ఒక్కరు మాస్క్ ధరించడం, సామాజిక దూరం పాటించడం, చేతులను శానిటైజర్‌తో శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవగాహన కల్పిస్తున్నాం.

అక్రమాల ఆట..!

(5వ పేజీ తరువాయి)

అడుగడుగునా అక్రమాలకు పాల్పడ్డారు. ఉమ్మడి జిల్లాలో రూ.70 లక్షల వరకు నిధులను కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంతులేని అవినీతిపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆ మేరకు విజిలెన్స్ అధికారులు మూడు బృందాలుగా బుధవారం విచారణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 25 మండలాల్లో విచారణ పూర్తి చేసినట్లు తెలిసింది. దీంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది.


ఆడుదాం ఆంధ్రాపై విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

జగన్ బొమ్మలతో నాసిరకం కిట్లు

వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ బొమ్మలతో నాసిరకంగా స్పోర్ట్స్ కిట్లు, టీ షర్టులు అందజేశారు. ప్రభుత్వాధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించినా... అంతా వైసీపీ నేతల కనుసన్నల్లోనే జరిగాయి. ఆటలపై కనీస అవగాహన లేని పిల్లలను మైదానంలోకి తీసుకువచ్చి... ఆడించడంతో పలుచోట్ల గొడవలు తలెత్తాయి. పలుచోట్ల పోటీలను వాయిదా వేయాల్సి వచ్చింది కూడా. ఇలా.. వైసీపీ నేతలు, అధికారులు అడ్డగోలుగా నిధులను కాజేశారు. ఆడుదాం ఆంధ్రా పోటీల సమయంలో ఉన్న అనంతపురం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీఓ) నిధులను దోచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి పాలనలోనూ ఆ అధికారికి అందలం దక్కడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. వివరాలు అడిగిన వెంటనే అందజేస్తున్నాం. ఆడుదాం ఆంధ్రా క్రీడా సామగ్రిని నార్పల స్టేడియంలో భద్రపరిచాం.

- ఉదయ్‌భాస్కర్, అనంతపురం, శ్రీసత్య జిల్లాల క్రీడాభివృద్ధి అధికారి


తుప్పు పట్టిన క్లోరినేషన్ సిలిండర్ అమర్చే పరికరాలు


పనిచేయని ఆలం మిక్చర్ ప్లాంట్ మోటారు

నీటిశుద్ధిపై నిర్లక్ష్యం

వైసీపీ హయాంలో విడుదల కాని నిధులు
కరుమరుగైన క్లోరినేషన్
తుప్పుపట్టిన పరికరాలు
సత్యసాయి తాగునీటి సరఫరాకు వెంటాడుతున్న కష్టాలు

కూడేరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాపైనా వైసీపీ పాలకులు నిర్లక్ష్యం వహించారు. గత పాలనలో సత్యసాయి నీటిశుద్ధి కేంద్రానికి నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో నిర్లక్ష్యానికి గురయింది. నాలుగేళ్లుగా నీటిని శుద్ధిచేయడానికి వినియోగించే క్లోరినేషన్ గ్యాస్‌ను వాడలేదు. కూడేరు మండలం పీఏబీఆర్ డ్యాంలోని సత్యసాయి తాగునీటి శుద్ధి కేంద్రంలో నీటిని శుద్ధి చేయడానికి వినియోగించే క్లోరినేషన్ గ్యాస్‌తోపాటు ఆలం మిక్చర్ మోటర్లు, పైపులు, ఇతర పరికరాలు పూర్తిగా దెబ్బతిని తుప్పు పట్టాయి. క్లోరినేషన్‌తోపాటు ఆలం ఉపయోగించి నీటిని శుద్ధి చేస్తారు. ఏరియేటర్‌లో నుంచి వచ్చే నీరు అపరిశుభ్రంగా ఉంటే అలంతోపాటు క్లోరినేషన్ గ్యాస్ కలుపుతారు. ఆ నీరు క్లారియేటర్‌కి వెళ్లి అక్కడ శుభ్ర పరిచిన అనంతరం నీరు మొత్తం ఫిల్టర్ హౌస్‌లోకి వెళ్తాయి. నీటిలో కలిపే క్లోరినేషన్ గ్యాస్ మాయమయింది. దీని స్థానంలో బ్లీచింగ్ పౌడర్‌ను కలపడం, ఆలం గడ్డలను నేరుగా నీటిలోకి వేయడంతో సక్రమంగా శుద్ధి కాలేదు. పీఏబీఆర్‌డ్యాంలోని సత్యసాయి తాగునీటి ప్లాంట్ నుంచి కూడేరు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, కళ్యాణదుర్గం, కుందుర్పి, బెళుగుప్ప, ఉరవకొండ, రాప్తాడు, కంబదూరు తదితర మండలాల్లో దాదాపు 150 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది. పథకం ప్రారంభం నుంచి ఎల్‌అండ్‌టీ సంస్థ ఆధ్వర్యంలో శుద్ధి కేంద్రాన్ని నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి రాగానే సత్యసాయి తాగునీటి పథకానికి నిధులు విడుదల చేయకపోవడంతో ఎల్‌అండ్‌టీ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంది. అప్పటి నుంచి సత్యసాయి తాగునీటి పథకం నిర్లక్ష్యానికి గురయింది. నిధులు సక్రమంగా రాకపోవడంతో ప్లాంట్ నిర్వహణ, కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొంది. నీటిని సరఫరా చేసే విద్యుత్ మోటర్ ఇటీవల కాలిపోవడంతో దాదాపు 22 రోజులు నీరు బంద్ అయ్యాయి. దీంతో గ్రామాల్లో తాగునీరు లేక జనం అల్లాడిపోయారు. అదనపు మోటర్ లేకపోవడంతో కొత్త మోటర్ కొనుగోలు చేసి తీసుకురావడానికి ఇన్ని రోజులు పట్టింది. సత్యసాయి నీటి సరఫరా చరిత్రలో ఇలా జరగడం తొలిసారి. ఏరియేటర్ నుంచి వచ్చే నీటిలోకి బ్లీచింగ్‌తోపాటు ఆలంను కలిసిన నీరు క్లారియేటర్‌లోకి వెళితే ఆ నీరును శుద్ధి చేయడానికి వినియోగించే మోటర్ గత నాలుగు సంవత్సరాలుగా పని చేయలేదు. దీంతో క్లారియేటర్‌లోకి వచ్చిన నీరు వచ్చినట్లు ఫిల్టర్ హౌస్‌లోకి వెళుతున్నాయి. అక్కడి నుంచి సంపులోకి పంపి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు.


పనిచేయని క్లారియేటర్ మిషన్

మరమ్మతులకు నిధులు విడుదల

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేయని క్లోరినేషన్ ప్లాంట్ మరమ్మతులకు నిధులు విడుదలయ్యాయి. గత ప్రభుత్వంలో నిధులు సక్రమంగా రాకపోవడంతో క్లోరినేషన్ గ్యాస్ వినియోగించలేదు. కేవలం బ్లీచింగ్ పౌడర్ కలిపి నీటిని సరఫరా చేశాం. ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నాలుగు నీటిశుద్ధి కేంద్రాల్లో క్లోరినేషన్ గ్యాస్ ప్లాంట్ తోపాటు ఆలం కలిపే ప్లాంట్లకు మరమ్మతులు చేస్తాం.

-రామారావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

మద్దతు ధరలతో ఊరట

(5వ పేజీ తరువాయి)

ధరలు బాగా పెరిగాయి.

ధరలు లేక దళారుల పాలయ్యేవి..

వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కల్లాల్లోనే అందినకాడికి అమ్ముకునేవారు. దళారులు ఎంత చెబితే అదే ధర. పంట పండినా మద్దతు ధరకు అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం మొక్కజొన్న, రాగి, కంది, వేరుశనగ పంటలకు గిట్టుబాటు ధరలు ప్రకటించి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంది. గతంలో బహిరంగ మార్కెట్‌లో రాగి పంట క్వింటాలు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు పలికేది. ఇప్పుడు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 4,886 మద్దతు ధర ప్రకటించింది. మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2 వేల నుంచి రూ. 2,200 వరకు ఉండగా.. ఇప్పుడు ప్రభుత్వ మద్దతు ధరే రూ. 2400 ప్రకటించింది. కంది పంట మార్కెట్లో క్వింటాలు రూ. 5,500 నుంచి రూ. 6,500 వరకు ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం ఏకంగా రూ. 8 వేల మద్దతు ధర ప్రకటించింది.

ప్రభుత్వమే కొనడం మంచి పరిణామం



గతంలో ఎంతో కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధరలు లభించక నష్టాలకు గురయ్యాం. దళారులు ఎంతకు అడిగితే అంతకు పంటను అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వం మంచి మద్దతు ధరలు నిర్ణయించి రైతులకు న్యాయం చేసింది. మద్దతు ధర కల్పిస్తూనే వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేస్తామని చెప్పడం శుభపరిణామం. దీంతో ధైర్యంగా పంటలు సాగుచేసుకునే వీలుంది. **-వేణుగోపాల్, దేమకేతేపల్లి**

రైతులకు న్యాయం జరిగింది



ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో రైతులకు కొంత న్యాయం జరిగింది. గత ప్రభుత్వంలో మద్దతు ధర లేక నష్టాలకే పంటలను అమ్ముకున్నాం. మొక్కజొన్నకు మాత్రమే మద్దతు ధర ఇచ్చారు. అది కూడా మార్కెట్ ధర కంటే తక్కువగా ఉండటంతో రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పుడు మొక్కజొన్న, కంది, రాగి పంటలకు మంచి మద్దతు ధర ప్రకటించారు. ఈ సీజన్‌లో ఈ పంటలనే సాగు చేస్తాం. **-రంగప్ప, సోమఘట్ట**

గిట్టుబాటు ధరలతో రైతులకు మేలు



ప్రభుత్వం గత ఏడాది కంటే మొక్కజొన్న, రాగి, కంది, వేరుశనగ పంటలకు మంచి మద్దతు ధర ప్రకటించింది. ఈ ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రధానంగా ఈ ప్రాంతానికి అనువైన మొక్కజొన్న, కంది, రాగి పంటలపై రైతులు ఆసక్తి చూపాలి. తక్కువ పెట్టుబడితో మంచి లాభం పొందడానికి అవకాశం ఉంది. మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోతే.. మద్దతు ధరతో ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. రైతులు ఈ విషయాన్ని గుర్తించుకోవాలి.

-వంశీకృష్ణ, మండల వ్యవసాయాధికారి, చిలమత్తూరు

దేవదాయ శాఖ ఏసీ బాధ్యతల స్వీకరణ



తిరుమలరెడ్డికి అభినందనలు తెలుపుతున్న అర్చక సమాఖ్య నాయకులు

అనంతపురం కల్చరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): దేవదాయ, ధర్మదాయ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ సహాయ కమిషనర్‌గా తిరుమలరెడ్డి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈ స్థానంలో ఉన్న ఆదిశేషనాయుడును ప్రధాన కార్యాలయానికి సరెండర్ చేశారు. కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న తిరుమలరెడ్డి అనంతపురం జిల్లా సహాయ కమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య నాయకులు తిరుమలరెడ్డిని కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. జిల్లాలోని పలువురు ఈఓలు ఇన్‌చార్జ్ సహాయ కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ అంజనేయులు, కోశాధికారి శ్రీనివాసులు, పాల్తూరు విజయ్, చంద్రమౌళి, నవీన్, చేతన్, ఉదయ్, తిరుపతయ్య, మధుసూదనాచార్యులు పాల్గొన్నారు.

ఇక సచివాలయ ఉద్యోగుల వంతు..

బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

నెలాఖరులోపు పూర్తి చేయాలని ఉత్తర్వులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ వచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నెలాఖరులోపు పూర్తి చేయాలని ప్రభుత్వ కార్యదర్శి భాస్కర్ జీఓ ఎంఎస్ నెంబర్-5 ను గురువారం జారీ చేశారు. బదిలీల ప్రక్రిలో భాగంగా చేపట్టాల్సిన నియమ నిబంధనలను కూడా అందులో పేర్కొన్నారు. ఒకే స్థానంలో మే 31లోగా ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారిని తప్పనిసరిగా బదిలీ చేయా లని పేర్కొన్నారు. సొంత మండలంలో ఉండకుండా చూడాలన్నారు. రెండేళ్లకు పైబడి ట్రైబల్ ప్రాంతాల్లో పని చేసిన వారికి బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. స్పౌజ్, దీర్ఘకాలిక అనారోగ్యం ఉన్న వారికి మినహాయింపులు ఇచ్చేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో గ్రామ సచివాలయాల్లో పని చేసే గ్రేడ్-5 సిబ్బందికి సంబంధిం చి క్యాడర్ స్ట్రెంత్ 567 ఉంది. అయితే 487 మంది మాత్రమే వర్కింగ్‌లో ఉన్నారు. 80 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్స్‌కు సంబంధించి క్యాడర్ స్రెంత్ 896 ఉండగా ప్రస్తుతం 841 మంది మాత్రమే వర్కింగ్‌లో ఉన్నారు. 55 ఖాళీలు ఉన్నాయి. బదిలీల ప్రక్రియ ఈ నెల 30లోపు పూర్తి చేసి జూలై 10 లోపు ఆన్‌లైన్‌లో వివరాల నమోదు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎట్టకేలకు ఏఓల బదిలీ ఉత్తర్వులు

అనంతపురం అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారుల బదిలీల ఉత్తర్వులు ఎట్టకేలకు జారీ అయ్యాయి. ఈనెల 9వతేదీ అర్ధరాత్రి వ్యవసాయ శాఖ అధికారుల బదిలీల ఉత్తర్వులు జారీ చేయగా.. ఆ మరుసటి రోజు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కార్యాలయం ఆదేశాలతో ఆపేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారుల బదిలీల తుది జాబితాను ఆ శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులు గురువారం విడుదల చేశారు. ఉమ్మడి అనంత జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏఓలను బదిలీ చేయడంతోపాటు కర్నూలు, కడప జిల్లాల్లో పనిచేస్తున్న కొందరు ఏఓలను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ క్రమంలో 73 మంది అధికారులను బదిలీ చేశారు. పాత జాబితాతో పోలిస్తే.. పరిగి, ఎరువుల పరీక్షా కేంద్రాలకు బదులుగా.. ఇద్దరు ఏఓలకు ఒకరికి భూసార సంరక్షణా కేంద్రం, మరొకరికి భూసార పరీక్షా కేంద్రానికి మార్పు చేశారు. మిగతా ఏఓల బదిలీల్లో ఎలాంటి మార్పు చేయలేదు. మిగతా జిల్లాల్లో కొన్ని మార్పులు చేసినట్లు సమాచారం. జేడీఏ కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న వెంకట్‌కుమార్ అనంతపురం ఏఓగా, మరో టెక్నికల్ ఏఓ బాలూనాయక్‌ను రైతు శిక్షణా కేంద్రానికి బదిలీ చేశారు. వెంకట్‌కుమార్ అక్కడ రిలీవ్ కావడంతోపాటు అనంతపురం ఏడీకి జాయినింగ్ రిపోర్టు ఇవ్వగా.. బాలూనాయక్ రైతుశిక్షణా కేంద్రంలో రిపోర్టు చేసుకున్నారు. వీరిద్దరు శుక్రవారం కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఏఓలు గురువారం రిలీవ్ అయ్యారు. మిగతా ఏఓలు శుక్రవారం రిలీవ్ అయి, కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఆ శాఖల్లో విడుదల కాని జాబితా

పశుసంవర్ధక, మత్స్య శాఖలకు సంబంధించిన అధికారులు, ఉద్యోగుల బదిలీల జాబితా ఇంకా విడుదల కాలేదు. ఏఓల జాబితా విడుదల కావడంతో తమ శాఖల్లో బదిలీల జాబితాలు వస్తాయని ఆయా శాఖల అధికారులు నిరీక్షించారు. ఆ ఊసేలేకపోవడంతో తీవ్ర నిరాశకులోనయ్యారు. దీంతో ఎప్పటిలోగా తమకు బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారో తెలియని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురంరూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.33,640 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.5వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 680టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

తొలిరోజే పస్తు

మధ్యాహ్న భోజనం లేక విద్యార్థుల ఇబ్బందులు

రొద్దం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బిల్లులు రాలేదని విద్యార్థులను పస్తులు ఉంచిన సంఘటన ఎం.కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగింది. ఇక్కడ మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహించే రామాంజప్పకు నాలుగు నెలలుగా బిల్లులు రాలేదు. దీంతో పాఠశాల ప్రారంభమైన తొలి రోజే భోజనం వండిపెట్టడానికి ఆయన మొండికేశారు. దీంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు మధ్యాహ్న భోజనం లేక అల్లాడిపోయారు. ఈ విషయంపై ఎంఈఓ జయభాస్కర్‌ను వివరణ కోరగా ఏజెన్సీ నిర్వాహకుడు రాకపోవడంతో మధ్యాహ్న భోజనం పెట్టలేదని, శుక్రవారం నుంచి తప్పకుండా అమలు చేస్తామని పేర్కొన్నారు.

అద్వితీయం

‘తల్లికి వందనం’లో జిల్లాకు రాష్ట్రంలో రెండో స్థానం

అర్హులైన 2,94,559 మంది విద్యార్థులు

1,84,695 మంది తల్లులకు లబ్ధి

ఒకటి, ఇంటర్ అడ్మిషన్ల తర్వాత మరింత పెరిగే చాన్స్

అనంతపురం విద్య, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 2,94,559 మంది విద్యార్థులను తల్లికి వందనం పథకానికి అర్హులుగా విద్యాశాఖ తేల్చింది. దీంతో 1,84,695 మంది పిల్లల తల్లులకు లబ్ధి చేకూరనుంది. 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ, ఇంటర్ సెకెండ్ ఇయర్ విద్యార్థులకు సంబంధించి ఈ మేరకు విద్యాశాఖ అర్హులను ఎంపిక చేసింది. తర్వాత 1వ క్లాస్, ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు పూర్తయిన తర్వాత ఈ లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ సెకెండియర్ వరకూ చదివే విద్యార్థులు ఇంట్లో ఎంత మంది ఉన్నా ఒకరికే అమ్మఒడి ఇచ్చే వారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఇస్తామని ప్రకటించింది. చెప్పినట్లుగానే స్కూళ్ల పునఃప్రారంభం రోజునే తల్లికి వందనం పథకానికి సంబంధించిన జీవోలు 26, 27 విడుదల చేశారు. ఆ దిశగా ప్రభుత్వం పిల్లల తల్లులకు లబ్ధి చేకూర్చేందుకు అడుగేసింది. రాష్ట్రంలో కర్నూలు తర్వాత అనంతపురం జిల్లాలోనే అత్యధికంగా తల్లులను అర్హులుగా గుర్తించారు.

తల్లిదండ్రుల్లో సంతోషం

పాఠశాలల ప్రారంభం రోజునే తల్లికి వందనం అమలు చేస్తూ జీవోలు విడుదల కావడం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థుల తల్లిదండ్రుల్లో సంతోషాన్ని నింపింది. పేరెంట్స్, ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు ఇలా అందరి నోటా ఇదే మాట గురువారం వినిపించింది. తల్లికి వందనం పథకానికి సంబంధించిన కీలక బాధ్యతలు గ్రామ, వార్డు సచివాలయాలకు అప్పగించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలపైన అన్ని గ్రామ వార్డు సచివాలయాలకు జాబితాలు కేటాయించారు. ఆయా సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులు, అనర్హుల జాబితాలను సచివాలయాలకు కేటాయించారు. తుది అర్హులు, అనర్హుల జాబితాలు పంపారు. నాలుగు చక్రాల వాహనం ఉన్నవాళ్లు, విద్యుత్ వినియోగం సగటున 300 యూనిట్లు కంటే ఎక్కువ ఉన్న వాళ్లు, సరైన ఇన్‌కం సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయని వారిని, మెట్ట భూమి 10 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న వారిని, ఆదాయపు పన్ను చెల్లించే వారిని, పట్టణాల్లో రూ.12 వేలుపైన, గ్రామాల్లో రూ.10 వేల కంటే ఎక్కువ నెల ఆదాయం ఉన్న కుటుంబాలను అనర్హుల జాబితాలో ఉంచారు. అర్హుల, అనర్హుల జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. తర్వాత లబ్ధిదారులు ఏవైనా సందేహాలున్నా, గ్రీవెన్సులున్నా, సచివాలయాల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

పరామర్శ.. పన్నాగం..!

(5వ పేజీ తరువాయి)

లబ్ధి కోసం అరాచకానికి తెరలేపారు.

ఆ ఘటన మరువకనే..

ఈ ఏడాది ఏప్రిల్ 8న మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లి పరామర్శలో జగన్నాటకంతో ప్రభుత్వ భద్రతా వైఫల్యంగా చిత్రీకరించే కుట్రకు తెరలేపిన సంగతి తెలిసిందే. కుంటిమద్ది సమీపంలో హెలీప్యాడ్‌లో దిగిన జగన్ పోలీసులు తగిన భద్రత కల్పించలేదనీ, హెలీకాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతిందంటూ రోడ్డు మార్గాన బెంగళూరుకు వెళ్లి హైడ్రామాకు తెరలేపారు. పోలీసుల వైఫల్యం అంటూ ప్రభుత్వంపై నిందలు వేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు. పోలీసుల బట్టలూడదీస్తానంటూ జగన్ హెచ్చరించారు. ఇదంతా వైసీపీ కుట్ర అని తేల్చిన పోలీసులు.. ఆ పార్టీ నేతలపై కేసులు కట్టారు. ఇదే తరహాలోనే బాలికపై అత్యాచారం ఘటనను రాజకీయంగా లబ్ధిపొందేలా కుట్ర పన్నుతున్నట్లు స్పష్టమవుతోంది. అందులో భాగమే వైసీపీ ‘చలో పేరూరు’ అన్న వాదనలు వినిపిస్తున్నాయి. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇందులో కీలకంగా మారి జిల్లా నలుమూలల నుంచి శ్రేణులను పేరూరుకు తరలించే ప్రయత్నం చేశారు. పరామర్శల పేరుతో మరోమారు శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ఉద్రిక్తతలు సృష్టించే కుతంత్రం పన్నారు. అది కూడా.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజున టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టే ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. పోలీసులు ముందస్తుగా పేరూరుకు వెళ్లే దారులన్నింటినీ దిగ్బంధించి, వైపీపీ పరామర్శ కుట్రను భగ్నం చేశారు.

ఎవరిని పరామర్శిద్దామని..?

అత్యాచార బాధిత బాలిక అనంతపురంలో చికిత్స పొందుతోంది. కుటుంబ సభ్యులు కూడా అక్కడే ఉన్నారు. బాధిత కుటుంబసభ్యుల పరామర్శ పేరుతో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ‘చలో పేరూరు’కు పిలుపునిచ్చారు. పేరూరుకు వెళ్లేందుకు వివిధ మార్గాల్లో ఆయనతోపాటు వైసీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, వైసీపీ శింగనమల ఇన్‌చార్జి సాకే శైలజానాథ్ మరికొందరు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా చలో పేరూరుకు అనుమతి లేదని పోలీసులు ప్రకటించినా వైసీపీ నేతలు బేఖాతరు చేయడం అనుమానాలకు తావిస్తోంది. పెనుకొండలో జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ జాతీయ రహదారిపై బైఠాయించారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న ఉషశ్రీ

బాధిత బాలిక అనంతపరంలో ఉంటే పేరూరుకు పరామర్శకు పిలుపునివ్వడం వైపీపీ కుట్రకు నిదర్శనం. అత్యాచార బాధిత బాలిక పేరు, గ్రామం వెల్లడించకూడదని సుప్రీంకోర్టు మార్గదర్శకాలున్నా.. వైసీపీ పరామర్శకు పిలుపునివ్వడం శోచనీయం. పైగా కూటమిప్రభుత్వం ఏడాది పాలన టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీ సంబరాలు చేసుకుంటున్న వేళ వైసీపీ పరామర్శల పేరుతో జిల్లావ్యాప్తంగా శ్రేణులను పేరూరుకు తరలించే ఎత్తుగడ చూస్తే గొడవ జరిగితే భద్రతా వైఫల్యం అంటూ ప్రభుత్వంపై నిందలు వేసే కుట్ర అని స్పష్టమవుతోంది.

పోలీసులకు మేరుగ వార్నింగ్

పేరూరుకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ మంత్రి మేరుగ నాగార్జునను కనగానపల్లి మండలం మద్దెలచెరువులో పోలీసులు అడ్డుకున్నారు. పేరూరుకు వెళ్లేందుకు అనుమతి లేదనీ, వెనుదిరిగి వెళ్లాలని సూచించారు. వారిపై మాజీ మంత్రి మేరుగ నాగార్జున చిందులు తొక్కారు. ‘ప్రభుత్వం మారుతుంది. మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాబోతున్నారు. మీరు బాధ్యతాయుతంగా ఉండకపోతే ఇబ్బందులుపడతారం’టూ పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. ఇంకోరోజు వేయి మందితో వస్తాననీ, అప్పుడు అడ్డుకుంటారా అంటూ సవాల్ విసిరారు.

ఉషశ్రీ వాగ్వాదం

పెనుకొండ రూరల్: వైసీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ.. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ‘చలో పేరూరు’కు వెళ్తున్న పెనుకొండలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో జాతీయ రహదారిపై ఉషశ్రీ, పార్టీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాము వెళ్లి తీరతామంటూ పోలీసులతో ఆమె వాగ్వాదానికి దిగారు. అనంతరం సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందితో వెళ్లి ఉషశ్రీని హౌస్ అరెస్టు చేశారు.

రైతులకు బురిడీ..!

పాసుపుస్తకాలు తనఖా పెట్టి రూ.11 కోట్ల రుణం

ఏడు సంవత్సరాలైనా తిరిగి చెల్లించని వైనం

లబోదిబోమంటున్న 42 మంది రైతులు

నరేంద్రరెడ్డిపై కణేకల్లు పోలీసులకు ఫిర్యాదు



కేసీఎన్ఆర్ కల్యాణ మండపం వద్ద మాట్లాడుతున్న రైతులు

కణేకల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తమను నమ్మించి, తమ పేరుతో ఉన్న పాసుపుస్తకాలను పలు బ్యాంకుల్లో తనఖా పెట్టి ఏడు సంవత్సరాల క్రితం తీసుకున్న రూ.11 కోట్లను తిరిగి చెల్లించకపోవడంతో తమ పరిస్థితి దయనీయంగా తయారయిందని పలువురు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కణేకల్లు మండలానికి చెందిన 42 మంది రైతులు గురువారం ఈ విషయంపై విలేకరులతో తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఏడేళ్ల క్రితం కణేకల్లుకు చెందిన నరేంద్రరెడ్డి అనే వ్యక్తి పలువురు రైతులను నమ్మించి వారి పొలం పాసుపుస్తకాలతో బొమ్మనహాళ్‌లోని కర్ణాటక బ్యాంక్, కణేకల్లులోని ఆంధ్రాబ్యాంక్‌లో తనఖా పెట్టి సుమారు రూ. 11 కోట్ల మేర రుణం తీసుకున్నాడు. ఇతడు మండల కేంద్రంలో కేసీఎన్ఆర్ కల్యాణమండపంతో పాటు చేపల కాలనీలో కేసీఎన్ఆర్ వేర్ హౌస్‌ను నిర్మించాడు. కానీ రైతులకు సంబంధించిన బ్యాంకులో తీసుకున్న సొమ్ము తిరిగి చెల్లించకపోవడంతో గత ఏడేళ్లుగా బ్యాంకర్లు పాసుపుస్తకాలకు సంబంధించి రైతులను రుణం కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈ విషయాన్ని రైతులందరూ నరేంద్రరెడ్డి దృష్టికి పలుమార్లు దృష్టికి తీసుకుపోయి రుణం చెల్లించాలని అడుగుతున్నప్పటికీ ఆయన చెల్లించకపోవడంతో ఏడేళ్లుగా రైతులు నలిగిపోతున్నారు. దీంతో వారంతా గురువారం కేసీఎన్ఆర్ కల్యాణమండపం, కేసీఎన్ఆర్ వేర్‌హౌస్‌కు తాళాలు వేసి తమ డబ్బులు చెల్లించేంత వరకు వదిలేది లేదని ఆందోళనకు దిగారు. అలాగే నరేంద్రరెడ్డిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూన్12(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు బెంగళూరు-బీదర్ మధ్య (వయా గుంతకల్లు) ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ (నం. 06539) ప్రత్యేక రైలును ఈ నెల 15, 20, 22, 27, 29 తేదీల్లో నడపనున్నట్లు వెల్లడించారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06540)ను ఈ నెల 16, 21, 23, 28, 30 తేదీల్లో నడపనున్నట్లు వివరించారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, వాడి, షాద్‌నగర్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని పేర్కొన్నారు.

స్కూళ్లు, హాస్టళ్లకు సన్నబియ్యం

అవకతవకలకు ఆస్కారం లేకుండా క్యూఆర్ కోడ్

పౌర సరఫరాల శాఖ మేనేజర్ రమేష్‌రెడ్డి

అనంతపురంటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇక నుంచి పాఠశాలలు, హాస్టళ్లకు ప్రత్యేకంగా సన్న బియ్యం సరఫరా చేస్తామని పేర్కొన్నారు. పౌర సరఫరాల సంస్థ గోదాముల నుంచి నాణ్యమైన సన్న బియ్యాన్ని 25 కిలోల ప్యాకెట్ల రూపంలో సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో 1715 పాఠశాలలు, 183 వసతి గృహాలకు నేరుగా గోదాముల నుంచే సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. అవకతవకలు జరగకుండా ఉండేందుకు ప్రతి 25 కిలోల బియ్యం ప్యాకెట్‌కు ప్రత్యేకంగా క్యూఆర్‌కోడ్ జతపరిచామని అన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేస్తే బియ్యానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. హెచ్ఎంలు, వార్డెన్లు బాధ్యతగా వ్యవహరించి పిల్లలకు భోజనం అందించాలని డీఎం రమేష్‌రెడ్డి కోరారు.

నిరసనల నడుమ కౌన్సెలింగ్

మధ్యాహ్నం 12 గంటల తర్వాత ప్రారంభం

సీరియల్ నంబర్ 351 నుంచి మొదలు

ఆర్‌జేడీ శామ్యూల్ పరిశీలన

అనంతపురం విద్య, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ నిరసనల నడుమ కొనసాగుతోంది. మూడో రోజు కూడా పంగల్ రోడ్డులోని ఆర్డీటీ ఆడిటోరియంలో ఎస్‌జీటీల కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం రాత్రి అంతా సాగిన కౌన్సెలింగ్ గురువారం ఉదయం 6 గంటల వరకూ నిర్వహించి తర్వాత బ్రేక్ ఇచ్చారు. అనంత రం ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించినా తీవ్ర నిద్ర బడలిక వల్ల ఉద్యోగులు ఆలస్యంగా రావడంతో మధ్యాహ్నం 12 గంటల తర్వాత కౌన్సెలింగ్ ప్రారంభించారు. సీరియల్ నెంబర్ 351 నుం చి కౌన్సెలింగ్ మొదలు పెట్టారు. ఆర్‌జేడీ శామ్యూల్, జిల్లా పరిశీలకులు సుబ్బారావు కౌన్సెలింగ్‌ను పరిశీలించారు. రాత్రి 10 గంటలకు సీరియల్ నెంబర్ 700 వరకూ కౌన్సెలింగ్ పూర్తి చేశారు.

డీఈఓ పూల్ టీచర్ల నిరసన

డీఈఓ పూల్ లో ఉన్న భాషాపండితులు కౌన్సెలింగ్ సెంటర్ బయట నేలపై కూర్చొని నిరసన తెలిపారు. బలవంతపు బదిలీలు మాకొద్దు, భాషా పండితులను ఉన్నతీకరించి, శాశ్వత స్థానాలు కేటాయించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. గత ఆరేళ్లుగా బదిలీలు, వర్క్ అడ్జెస్ట్‌మెంట్ అంటూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధిత టీచర్లు, సంఘాల నాయకులు వాపోయారు. తర్వాత సమస్యలను ఆర్‌జేడీ శామ్యూల్ దృష్టికి తీసుకెళ్లారు.



నిరసన తెలుపుతున్న డీఈఓ పూల్ టీచర్లు

పులిపిరికి అరుదైన చికిత్స



► ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు

అనంతపురం జిల్లా : జూన్ 13: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. అనంతపురం జిల్లాలోని, కీర్తిరెసిడెన్సీ, కమలా నగర్, DCMS రోడ్, అనంతపురం నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శని రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

త్రీటౌన్‌లో కానిస్టేబుల్ సస్పెన్షన్

మరో ఇద్దరు హోంగార్డులు...

వ్యభిచార గృహం నుంచి మామూళ్లే కారణం?

అనంతపురం క్రైం, జూన్12(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ వ్యభిచార గృహనిర్వహణలో మామూళ్లు వసూలు చేశారన్న ఆరోపణలపై ఓ కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులను సస్పెండ్ చేశారు. నాలుగు రోజుల కిందట వెలుగు చూసిన వ్యవహారంలో తాజాగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ చంద్రశేఖర్, హోంగార్డులు మధు, సోముపై చర్యలు తీసుకున్నారు.

ప్రతి వారం మామూళ్లు ఇవ్వాల్సిందే

నగరంలోని రెండో రోడ్డులో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. అక్కడ ఓ మహిళ ఆధ్వర్యంలోనే ఆ గృహం నడుస్తోంది. అక్కడ సంబంధిత కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులు ప్రతి వారం మామూళ్లు పుచ్చుకుంటున్నట్లు తెలిసింది. ఇదంతా ఒక ఎత్తయితే ఆ గృహంలో వీరి పాత్ర కీలకని సమాచారం. కొత్తగా తీసుకొచ్చే అమ్మాయిలు మొదట ఈ ముగ్గురితో కలవాలట. నాలుగు రోజుల క్రితం డయల్-100కు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా త్రీటౌన్ పోలీసులు ఆ వ్యభిచార గృహంపై దాడులు నిర్వహించారు. ఆ సమయంలో నిర్వాహకురాలిని అరెస్ట్ చేశారు.

విచారణలో బట్టబయలు

నిర్వాహకురాలిని ఓ పోలీస్ ఉన్నతాధికారి విచారించారు. అందులో కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగుచూసినట్లు తెలిసింది. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డుల తీసుకునే ముడుపులు, కొత్తగా వచ్చేవారికి మొదటి విటులు వాళ్లేనని చెప్పినట్లు సమాచారం. ఆ మేరకు ఫోన్‌పేలలో పంపిన డబ్బు రుజువులతో చూపినట్లు తెలిసింది. దీంతో ఆ ముగ్గురినీ సస్పెండ్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వ్యభిచార గృహం నిర్వహణ, పైసా మామూళ్లు ఆ పోలీస్‌స్టేషన్‌లో పై అధికారులకు తెలియకుండానే జరుగుంతోందా..? అనే సందేహం వ్యక్తమవుతోంది.

ఇద్దరు పిల్లలు సహా మహిళ అదృశ్యం

ఉరవకొండ,జూన్12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగావీధికి చెందిన షాహినా అనే మహిళ తన ఇద్దరు పిల్లలతో సహా కనబడడం లేదు. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. రంగావీధిలో నివాసముంటున్న షాహినా తన ఆరేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తెతో పాటు గురువారం మధ్యాహ్నం నుంచి కనబడడం లేదని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి ఆచూకి ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సీఐ మహానంది తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరువపల్లి వద్ద రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని రాజశేఖర్ (32) అనే వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మరువపల్లికి చెందిన రాజశేఖర్ గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరావు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించారు. అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

రెండు వ్యభిచార గృహాలపై దాడి

అనంతపురం క్రైం,జూన్12(ఆంధ్రజ్యోతి) : నగరంలోని హౌసింగ్‌బోర్డులో రెండు వేర్వేరు వ్యభిచార గృహాలపై టూటౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. గురువారం టూటౌన్ సీఐ శ్రీకాంత్‌కు అందిన సమాచారం మేరకు... హౌసింగ్‌బోర్డులోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. నిర్వాహకులు రామాజీ మేరి సుజాత, సరస్వతితో పాటు విటులను అరెస్ట్ చేశారు. అనంతరం అదే ప్రాంతంలోని మరో ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న లక్ష్మి, వనిత, వంశీ, అశోక్‌ను అరెస్ట్ చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రామగిరి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు డ్యాంకు చెందిన ఆదిలక్ష్మి(54) అనే మహిళ గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆదిలక్ష్మి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేది. ఇంటి వద్ద మోటారు వేయడానికి స్విచ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌గురై అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న రామగిరి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆదిలక్ష్మికి కుమారుడు ఉన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ధర్మవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలకు చెందిన మల్లికార్జున భార్య ఈశ్వరమ్మ(45) ధర్మవరం చెరువు ఒకటో మరువ వద్ద చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలకు చెందిన ఈశ్వరమ్మ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఆమె ఒకటో మరువ వద్ద చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు చెరువులో మహిళ శవాన్ని చూసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు బయటకు తీయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మహిళ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలికి భర్తతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు.


అనంతపురంలో కేక్ కట్ చేస్తున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- ఏడాది పాలన సంబరాల్లో కూటమి నాయకులు
- సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల నియోకవర్గాల్లోని పట్టణాలు, మండలకేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం టీడీపీ, జనసేన నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, అభిమానులు పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పలుచోట్ల బైక్ ర్యాలీలు చేపట్టారు. అనంతరం పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం అయ్యాక అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. హామీలన్నీ నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పథకాలన్నీ ఒక్కొక్కటిగా అన్నీ అమలవుతాయని చెప్పారు. తాజాగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని, ఈ నెల20న అన్నదాతసుఖీభవ కింద రైతులకు అకౌంట్లలోకి డబ్బు జమ చేస్తారని పేర్కొన్నారు. వచ్చే నాలుగేళ్లలో మరింత సుపరిపాలన అందిస్తారని అన్నారు.


రాప్తాడులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


పేరూరులో ఎన్టీఆర్, పరిటాల రవి చిత్రపటాల వద్ద నివాళులు


శింగనమలలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..


చెన్నేకొత్తపల్లి టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


గార్లదిన్నెలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కనగానపల్లి టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షం

బుక్కరాయసముద్రం,జూన్12(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తవడంతో మండల కేంద్రంలో టీడీపీ శ్రేణులు గురువారం విజయోత్సవ సంబరాలు చేశారు. ముఖ్య అతిథిగా శ్రీధర్‌బాబు వచ్చి జెండా స్థూపం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ఎన్నికల హామీలు నేరవేర్చేదిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ అశోక్, నాయకులు కేశన్న, లక్ష్మీనారాయణ, ఎస్‌నారాయణస్వామి, ఓబులపతి, మల్లేశు, చితంబరి, సోము, రంగమ్మ, మాజీ ఎంపీపీ ఎస్‌కె వెంకటేశులు పాల్గొన్నారు.


సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న పర్వతనేని శ్రీధర్‌బాబు తదితరులు

సిబ్బంది లేక రోగులకు అవస్థలు

- పట్టించుకోని ఉన్నతాధికారులు ● గార్లదిన్నె పీహెచ్‌సీలో దుస్థితి


వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వేచి ఉన్న రోగులు

గార్లదిన్నె, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో సిబ్బంది కొరతతో రోగులకు సేవలు అందడం లేదు. మండలంలోని గార్లదిన్నె, యర్రగుంట్ల గ్రామాల్లో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) ఉన్నాయి. గార్లదిన్నె పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. గార్లదిన్నె పీహెచ్‌సీ జిల్లా కేంద్రానికి 17 కిలో మీటర్ల దూరంలో ఉంది. గార్లదిన్నె మండలంతో పాటు శింగనమల మండలంలోని పలు గ్రామాల నుంచి రోజూ 80 నుంచి 100 మందికి పైగా రోగులు వస్తుంటారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ఇద్దరు సూపర్ వైజర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక ఎఫ్ఎన్ఓ, పీహెచ్‌ఎన్ఓ ఉండాలి. రెండేళ్ల క్రితం ఓ స్టాఫ్ నర్సు ఉద్యోగోన్నతిపై వెళ్లగా మరో స్టాఫ్ నర్సు రాజీనామా చేశారు. దీంతో ఉన్న ఒక్క స్టాఫ్ నర్సే విధులు నిర్వహించాల్సి ఉంది. ఆమె లేని సమయంలో ఫీల్డ్‌స్టాఫ్ స్టాఫ్ నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. ఎఫ్ఎన్ఓ (ఫీమేల్ నర్సింగ్ అడర్లి) పోస్టు, పీహెచ్ఎన్ పోస్టులు కూడా రెండేళ్ల నుంచి ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో రాత్రి సమయంలో విధులు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారు. శింగనమల మండలం లోలూరు నుంచి కల్లూరు వరకు జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. చిన్న చిన్న గాయాలైన క్షతుగాత్రులను ప్రథమ చికిత్స కోసం జాతీయ రహదారికి పక్కనే ఉన్న గార్లదిన్నె పీహెచ్‌సీకి తీసుకు వస్తుంటారు. రాత్రి సమయంలో సిబ్బంది లేకపోవడంతో అనంతపురం తీసుకెళ్లిన సంఘటనలు కోకొల్లలు. పీహెచ్‌సీలో సిబ్బంది కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


బీపీ చెక్ చేస్తున్న స్టాఫ్‌నర్సు శోభారాణి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉన్న విషయం వాస్తవమే. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్న సిబ్బందితోనే విధులు నిర్వహిస్తున్నాం. రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నాం. సిబ్బంది కొరత లేకుండా చేస్తే రోగులకు మరింత వైద్య సేవలందిస్తాం.

-మంజుల, వైద్యాధికారి

విమాన ప్రమాద మృతులకు నివాళి


నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నగరంలో టీడీపీ నాయకులు నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర నాయకులు గౌస్‌మొద్దీన్, ఆలంనరసానాయుడు, తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, బుగ్గయ్య చౌదరి, దండు శ్రీనివాసులు, విశాలాక్షి, నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు, కురబ నారాయణస్వామి, కృష్ణకుమార్ తదితరులు విమాన ప్రమాద మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం మౌనం పాటించి, సంతాపం తెలిపారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి దిగ్భ్రాంతి..

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్‌రూపానీతోపాటు 242 మందిప్రయాణికులు, 10 మంది క్రూ సిబ్బంది, ఇద్దరు పైలెట్లు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. మృతులకు సంతాపం తెలిపారు. అలాగే వడ్డెర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్, టీడీపీ బీసీ సెల్ నాయకుడు సిమెంట్ పోలన్న సంతాపం తెలియజేశారు.

డీఈ కిరణ్‌తేజ బాధ్యతల స్వీకరణ

అనంతపురం న్యూటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో ఇద్దరు డీఈలను బదిలీ చేస్తూ గత సోమవారం ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా అనంతపురం క్వాలిటీ కంట్రోల్ డీఈ గా ఉన్న రామారావు రాయదుర్గానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి పుంగనూరులో డీఈగా ఉన్న కిరణ్‌తేజ వచ్చి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

పథకంపై అవగాహన పెంచాలి

అనంతపురం అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆహార శుద్ధి క్రమబద్ధీకరణ పథకంపై ప్రజలకు అవగాహన పెంచాలని ఉద్యాన శాఖ హెచ్ఓ రత్నకుమార్ సూచించారు. నగరంలోని ఉద్యాన శాఖ డీడీ కార్యాలయంలో గురువారం ఆమె పీఎంఎఫ్ఎంఈ జోనల్ మేనేజర్ మారుతితో కలిసి మండల రీసోర్స్‌పర్సన్లతో సమావేశమై మాట్లాడారు. 18 ఏళ్ల వయసు నిండి అర్హత కలిగిన ఔత్సాహికులు కుటీర పరిశ్రమల ద్వారా లబ్ధి పొందేలా చూడాలన్నారు. పరిశ్రమ విలువలో 35 శాతం రాయితీ, 10 శాతం లబ్ధిదారుని వాటా, మిగతా 55 శాతం బ్యాంక్ ద్వారా రుణసదుపాయం ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో ఈ పథకంపై అవగాహన కల్పించి, లబ్ధిపొందేలా చొరవ చూపాలని సూచించారు.

పొట్టి శ్రీరాములు పాఠశాలకు బెంచీల వితరణ


బెంచీలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఒకటో రోడ్డులో గల శ్రీపొట్టి శ్రీరాములు నగర పాలకోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు బెంచీలు వితరణ చేశారు. 1976-77వ విద్యాసంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు పాఠశాలకు 20బెంచీలు అందజేశారు. తర్వాత నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, పూర్వ విద్యార్థులు ఇఫ్తేకర్, తులసిరెడ్డి, మనోహర్, హరినాథ్, దీక్షిత్, వన్నప్ప, శ్రీనివాసులు, మహబూబ్ బాషా, సలీంబాషా, వెంకటరామిరెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసరావు, రామిరెడ్డి, షేక్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

గొందిరెడ్డిపల్లిలో నేటి నుంచి ఉరుసు

రాప్తాడు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ శీనయ్య, ఎంపీటీసీ సభ్యుడు జాఫర్‌ఖాన్ గురువారం ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఉరుసు సందర్భంగా దర్గాను అలంకరించారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు ఘన స్వాగతం


మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు స్వాగతం పలుకుతున్న తెలుగు మహిళలు

అనంతపురం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు తెలుగు మహిళలు ఘన స్వాగతం పలికారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన రాయపాటి శైజలను మాజీ మేయర్ స్వరూప, తెలుగు మహిళలు విశాలాక్షి, స్వప్న, సంగా తేజస్విని, సరళ, లక్ష్మీనాయుడమ్మ, వడ్డే భవాని, కంఠాదేవి, వాణి, రజిని, గీత తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

శాప్ డైరెక్టర్‌కు డీఎస్‌డీఓ సన్మానం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): శాప్ డైరెక్టర్‌గా నియమితులైన బొమ్మినేని శివను గురువారం నగరంలోని ఆయన నివాసంలో డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి సమష్టి కృషి చేద్దామని కోరారు. కార్యక్రమంలో డీఎస్ఏ సూపరిండెంట్ దేవమణి, శాప్ కోచ్‌లు అనిల్‌కుమార్, మంజుల, జబీవుల్లా, ప్రతాప్, నరేష్‌కుమార్, సంధ్య, అలీ, ఓంప్రకాష్, రెడ్డెప్ప, వన్నూరప్ప పాల్గొన్నారు.

50 మంది యువత రక్తదానం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్12(ఆంధ్రజ్యోతి): నగరంలోని రూడ్‌సెట్ సంస్థ కార్యాలయంలో గురువారం కేంద్ర యువజన క్రీడాశాఖ, మై భారత్, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానశిబిరం జరిగింది. ఇందులో సుమారు 50మంది యువత రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రంతో సత్కరించారు. కార్యక్రమంలో మై భారత్ రాష్ట్ర కోఆర్డినేటర్ బిసాటి భరత్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు సుంకర రమేష్, రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, నాబార్డు డీడీఎం అనూరాధ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, ట్రైనర్ ఉషారాణి, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి బ్రోచర్ల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రామచంద్రనగర్‌లోని షిర్డిసాయిబాబా ఆలయంలో జూలై 10వ తేదీన నిర్వహించనున్న గురుపౌర్ణమి వేడుకల బ్రోచర్లను గురువారం సాయంత్రం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు మారుతి ప్రసాద్ మాట్లాడుతూ... భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

కారులో మృతదేహం

- విచారిస్తున్న పోలీసులు


వాహనంలో ఉన్న మృతదేహం

కనగానపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదులూరు వద్ద 44వ జాతీయ రహదారిపై కారులో మృతదేహం ఉండటం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్‌కు చెందిన రమేశ్ అనే యువకుడు కారులో ద్రాక్షను అనంతపురానికి తీసుకొచ్చాడు. అనంతరం తిరిగి గురువారం స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే వాహనం దాదులూరు వద్దకు రాగానే మరమ్మతుకు గురై నిలబడిపోయింది. దీంతో అతను స్టార్ట్ చేసేందుకు అదే గ్రామంలోని ఇద్దరు యువకులతో వాహనాన్ని తోయించాడు. ఈ దృశ్యం సీసీ కెమెరా పుటేజీలో రికార్డైంది. అయితే ఆ వాహనం రాత్రి అయినప్పటికీ రోడ్డుపై అలాగే ఉంది. దీంతో స్థానికులు అనుమానం వచ్చి చూడగా డ్రైవర్ సీటు కింద యువకుడి మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రామగిరి సీఐ శ్రీధర్, కనగానపల్లి ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజ్‌లో రికార్డు అయిన దృశ్యాలతో పాటు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అతను అతిగా మద్యం సేవించి మృతి చెందాడా.. లేదా వేరే కారణాలున్నాయా అన్నది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

విద్యామిత్ర కిట్ల పంపిణీ


ఆత్మకూరులోని హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు అందజేస్తున్న టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు

నార్పల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు జడ్పీ వైస్ చైర్ పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీడీఓ మమతా దేవి ప్రభుత్వం అందజేసిన సర్వే పల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుకోవడానికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత కుమారి, పాఠశాల కమిటీ చైర్మన్ రవికుమార్, ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యలక్ష్మి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురంరూరల్: మండలంలోని రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మంజునాథ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ బుల్లెట్ రఫీ, యాదవ సాధికార సమితి రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

● శింగనమల: మండలకేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు ఎంఈఓలు నరసింహులు, శివప్రసాద్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగేశ్వరి, టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సర్పంచ్ నాగమునెమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ గీతారాణి, స్కూల్ కమిటీ చెర్మన్ పెద్దక్క, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● రామగిరి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. పేరూరు ఉన్నత పాఠశాలలో సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు: మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఎంఈఓ నరసింహారెడ్డి, టీడీపీ మండల నాయకులు కలిసి విద్యార్థి కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు. పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, నాయకులు మనోరంజన్, ప్రభాకర రెడ్డి, రవీంద్రారెడ్డి, కందుల ఓబులపతి, వెంకటనారాయణ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● గార్లదిన్నె: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ఎంఈఓ తారా చంద్రానాయక్ విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



శింగనమల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సీఎం చంద్రబాబు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ప్రతి నెలా 64 లక్షల మందికి రూ. 2,720 కోట్ల మేర పింఛన్లు పంపిణీ చేస్తోందన్నారు. డీఎస్సీ నోఫికేషన్ ద్వారా 16,347 మందికి ఉద్యోగాలు కల్పించనుందన్నారు. దీపం-2 ద్వారా అర్హులకు ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తోందన్నారు. ఇక గుంతలమయమైన రోడ్ల మరమ్మతులకు రూ. 1200 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అదేవిధంగా మత్స్యకారులకు రూ. 259 కోట్లు సాయం చేసిందన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు 203 అన్న క్యాంటీన్లు ప్రారంభించదన్నారు. ఇక రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి 8.5 లక్షల మంది అన్నదాతల ఖాతాల్లోకి రూ. 13,584 కోట్లు జమచేసినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో రూ. 4500 కోట్ల వ్యయంతో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అన్నీ అమలు చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు.

స్కూల్‌బ్యాగుల పంపిణీ

అనంతపురం కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం వారు సంయుక్తంగా 22 మంది పేద విద్యార్థులకు గురువారం సాయంత్రం స్కూల్‌బ్యాగులు పంపిణీ చేశారు. ఆశ్రమ ఆవరణలో విద్యార్థులకు స్కూల్‌బ్యాగులతోపాటు చాక్లెట్లు, జ్యూస్‌ప్యాకెట్లను ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలామురళి అందజేశారు. సభ్యులు లలిత, భవిత తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంఐపీ ఏపీడీగా ధనుంజయ బాధ్యతలు

అనంతపురం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఏపీఎంఐపీ ఏపీడీ గా ధనుంజయ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీడీ గా పని చేసిన ఫిరోజ్ ఖాన్ కర్నూలుకు బదిలీ అయ్యారు. దీంతో ఆ యన స్థానంలోకి శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్‌గా ఉ న్న ధనుంజయను నియమించారు. నూతన ఏపీడీకి పలువురు ఉద్యోగులు, సిబ్బంది, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

బాలిక కుటుంబంపై వైసీపీ కపట ప్రేమ


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రామగిరి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలో అత్యాచారానికి గురైన దళిత బాలిక కుటుంబం పట్ల వైసీపీ వారు కపట ప్రేమ చూపిస్తూ మరింత అబాసు పాల్జేస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడ్డారు. మండలంలోని పేరూరులో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి బాలిక కుటుంబాన్ని తన స్వార్థ రాజకీయం కోసం వాడుకుంటున్నారన్నారు. ఆయన తరచూ ఆ కుటుంబాన్ని ఉద్ధరిస్తున్నట్లు నటిస్తూ టీడీపీ వారిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వారి చేష్టలకు ఆ బాలిక కుటుంబం మరింత ఇబ్బంది పడుతోందన్నారు. ప్రకాష్‌రెడ్డి కపట నాటకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. తాము విజయోత్సవ ర్యాలీ జరుపుకుంటుంటే మీ అల్లరిమూకలను ఇక్కడికి పంపడమేంటని, ఇదంతా గొడవలు సృష్టించడానికి కాదా అని ప్రశ్నించారు. మీరు ఏమి చేసినా బడుగు బలహీన వర్గాలు టీడీపీ వెంటే ఉంటాయన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, రంగయ్య, పరంధామయాదవ్, సుధాకర్, మారుతీప్రసాద్, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీధర్, ఎస్సీసెల్ సుబ్బరాయుడు, పోతన్న, మాదన్న, చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

తన్మయి హత్యకు నిరసనగా..

- వైసీపీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో గిరిజనుల ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్సీ రవిబాబు, జిల్లా అధ్యక్షుడు అనంత


తన్మయి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న వైసీపీ నేతలు

అనంతపురం క్రైం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన గిరిజన విద్యార్థిని తన్మయి కుటుంబానికి న్యాయం చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో గురువారం గిరిజన సంఘాల నాయకులు నగరంలోని జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించా రు. ఇందులో ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ కుంబా రవిబా బు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. తర్వాత తన్మయి తండ్రి లక్ష్మీపతితో కలిసి ఆర్డీఓ మలోలకు వినతిపత్రం అందజేశారు. ఘటన జరిగిన తీరు, పోలీసుల నిర్లక్ష్యాన్ని వివరించారు. బాధిత కు టుంబానికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం మృతురాలి కు టుంబసభ్యులను పరామర్శించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసబాబునాయక్, సురేంద్ర, నాయకులులక్ష్మణ్‌కుమార్, శ్రీనివాసులు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య కేసులో ఐదుగురి అరెస్టు

అనంతపురం క్రైం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సమీప బంధువులైన ఇరు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. దానిని హత్యగా బాధిత కుటుంసభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన అనంతపురం రూరల్ పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలో కోనయ్య, గంగాధర్ కుటుంబాల మధ్య స్థలం విషయంలో వివాదం నెలకొంది. 10వతేదీ రెండు కుటుంబాలు గొడవకు దిగాయి. ఈ క్రమంలో తోయడంతో కోనయ్య కింద పడి మృతి చెందాడు. ఘటనపై ఆయన కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం గురువారం గంగాధర్, ఆయన భార్య రాజమ్మ, బావమరిది రాము, ఇద్దరు కుమారులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

'నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు'

అనంతపురం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో నాటు సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో గురువారం ఆయన సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఏఈఎస్‌లు నరసింహులు, రేవతి, శ్రీరామ్ పాటు ఎక్సైజ్ సీఐలతో సమావేశమై మాట్లాడారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు పెంచి కేసులు నమోదు చేయాలన్నారు. నాటుసారా ద్వారా కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మద్యం షాపులు, బార్లలో నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

టీడీపీ సంబరాలు

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. గురువారం పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి నాయకులు తినిపించుకున్న ఏడాది పాలనలో ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు విజయవంతం అయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


గుంతకల్లులో మిఠాయి తినిపించుకుంటున్న నాయకులు


గుత్తిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


శెట్టూరులో..


వజ్రకరూరులో ఎన్టీఆర్, చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం


ఉరవకొండలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


విడపనకల్లులో..


పుట్లూరులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


యల్లనూరులో..


యాడికిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నాయకుల సంబరాలు

బెళుగుప్పలో 36.4 మి.మీ వర్షపాతం

బెళుగుప్ప, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 36.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఏరువాక పౌర్ణమి రోజు వర్షం కురిసి ఎర్రనేల భూములు పదునుకావడంతో ఖరీఫ్ రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

గుత్తిరూరల్: మండలంలో 22.7 మిమీ వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దార్ ఓబులేసు తెలిపారు. మండలం వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం వచ్చినప్పటి నుంచి విద్యుత్ సరఫరా అంతరాయం తలెత్తింది. రైతుల పొలాలు పదును కవడంతో వ్యవసాయ పనులను ప్రారంభించారు.

అదునులో విత్తన వేరుశనగ ఇవ్వకపోతే ఎలా?

- వ్యవసాయ శాఖ సిబ్బందిని ప్రశ్నించిన రైతులు

కంబదూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అదునులో వర్షం కురిసినా విత్తన వేరుశనగ ఇవ్వకపోతే ఎలా అని ఒంటారెడ్డిపల్లి రైతులు వ్యవసాయశాఖ సిబ్బందిని ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయశాఖ కార్యాలయంలో సిబ్బందితో రైతులు వాదించారు. స్థానిక సచివాలయంలో పనిచేసే అగ్రికల్చర్ అధికారి బదిలీపై వెళ్లాడని, అయినా ఇంతవరకు విత్తన వేరుశనగ పంపిణీ చేయకపోతే ఎలా వాదించారు. కంబదూరులో వచ్చి విత్తన వేరుశనగ ఇవ్వండని అడిగితే, మీ సచివాలయంలోనే తీసుకోండి అని సమాధానం ఇస్తున్నారన్నారు. అక్కడ ఇవ్వక, ఇక్కడ ఇవ్వక అదును దాటిన తర్వాత ఇస్తే ప్రయోజనం ఏముంటుందన్నారు. ఏవో జాఫర్ స్పందిస్తూ సోమవారం తప్పకుండా మీ గ్రామానికి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.


అధికారులతో వాదిస్తున్న ఒంటారెడ్డిపల్లి రైతులు

శ్మశానంలో పచ్చదనం పెంపొందిద్దాం

● మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, జూన్12(ఆంధ్రజ్యోతి): మీరందరూ సహకరిస్తే శ్మశానవాటికను గ్రీనరీ చేద్దామని గురువారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శ్మశానవాటిక సమీపంలో ఉన్న శివాలయం వద్ద చర్చావేదికను ఏర్పాటు చేశారు. పట్టణ ప్రముఖులు, పెద్దలు, కులపెద్దలు, తరలివచ్చారు. ఆయన మాట్లాడుతూ శ్మశానానికి 16.5ఎకరాలు ఉండేదని ప్రస్తుతం 4.7 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. ప్రస్తుతం జనాభా రోజు రోజుకు పెరుగుతూపోతుంటే శ్మశానవాటికను కబ్జాచేసి కేవలం 4.75 ఎకరాలు మాత్రమే మిగిల్చారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలకు శ్మశానం కూడా విడిచిపెట్టలేదంటే ఎంత దౌర్భాగ్యం అంటూ మండిపడ్డారు. ప్రస్తుతం శ్మశానం పట్టణానికి చాలదని వాటిని మీరందరూ ఏం చేయాలనుకుంటున్నారని మీ ద్వారానే చెప్పాలని ఆయన సూచించారు. కాశీ తర్వాత తాడిపత్రిలోనే నది ఒడ్డున శివాలయం పక్కన శ్మశానం ఉందని, మరెక్కడాలేదని అన్నారు. అలాంటి శ్మశాన వాటికను మనమందరం కలిసి గ్రీనరీ చేద్దాం అని మీ అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు. ఒక్కొక్కరు ఒక్కొక్క అభిప్రాయంతో మాట్లాడి అందరికి ఆమోదయోగ్యంగా సూచించారు. ప్రస్తుతం శ్మశానంలో పూడ్చుకుంటూ పోతే స్థలం ఉండదని, కాల్చే యంత్రాలను ఉపయోగించి కాపాడుకుందామని అన్నారు. గతంలో మంజూరైనవి పనిచేయకపోవడంతో నిరుపయోగంగా మారిపోయాయి. ప్రస్తుతం వాటిని అన్ని పక్కనబెట్టి వేరేవారితో రూ.35లక్షల ఖర్చుతో ప్రారంభం జరుగుతుందన్నారు. వాటిద్వారానే శ్మశానంలో కాల్చడం జరుగుతుందన్నారు. ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఆలోచనతో ముందుకు వెళ్లాలనుకున్నాం, మీ అభిప్రాయమే నా అభిప్రాయం నా ఒక్కరితో కాదు మీరందరూ అవునంటేనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఎస్వీ రవీంద్రారెడ్డి, సూర్యముని, జానకి రామయ్యశర్మ, శంకరయ్యశర్మ, ప్రతాప్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, రాధాకృష్ణ, సురేంద్రనాథ్‌గుప్త, శింగరి లక్ష్మి నారాయణ, కత్తి రామచంద్రారెడ్డి, రాజయోగానందరెడ్డి పాల్గొన్నారు.


చర్చావేదికలో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

కసాపురం రోడ్డు వెడల్పు చేయాలి

గుంతకల్లుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కసాపురం రోడ్డులోని రైల్వే వంతెన కింద రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని సీపీఐ నాయకులు కోరారు. స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా కసాపురం రోడ్డు వెడల్పు పనులు చేపడతామని ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నారు తప్పా, పనులు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సురేష్, జనసేవాదళ్ రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, నాయకులు గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

గుంతకల్లుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని వైఎస్ఆర్ యుజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ బాసిత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు తరలి రావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. నక్క నరప్ప, గోవిందు, శీన, ప్రశాంత్, చిన్న పాల్గొన్నారు.

వైద్య పోస్టులను భర్తీ చేయాలి

గుంతకల్లుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్‌కు సీపీఐ నాయకులు ప్రసాద్, నూర్ బాషా విన్నవించారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రికి విచ్చేసిన డీసీహెచ్ఎస్‌తో నాయకులు సమావేశం అయ్యారు. వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో సీటీస్కానింగ్, అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు.

16న దివ్యాంగులు, వయోవృద్ధుల గుర్తింపు శిబిరం

రాయదుర్గం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కణేకల్లురోడ్డులో ఉన్న మోడల్‌స్కూల్‌లో 16వ తేదీన దివ్యాంగులు, వయోవృద్ధుల గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. శిబిరంలో గుర్తింపు పొందిన వారికి అవసరమైన సహాయ జీవన పరికరాలైన చేతికర్రలు, వాకర్లు, వినికిడి యంత్రాలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

122 మంది రక్తదానం

రాయదుర్గం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సమైఖ్యాంధ్రభవన్‌లో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 122 మంది రక్తదానం చేశారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచె లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన శిబిరంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ విచ్చేసి దాతలకు మెమెంటోలు, ప్రోత్సాహక సర్టిఫికెట్లను అందించారు. జేవీవీ పట్టణ అధ్యక్షులు వీరన్న, గౌరవ అధ్యక్షులు అయూఫ్‌ఖాన్, జగదీష్ పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చట్టంపై అవగాహన ర్యాలీ

గుత్తి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లోని రైల్వే ఆస్పత్రి ఆధ్వర్యంలో లింగనిర్ధారణ చట్టంపై వైద్యాధికారి వెంకటేష్ గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైల్వే ఆస్పత్రి వద్ద నుంచి రైల్వే స్టేషన్ మీదుగా పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. లింగ వివక్షత, బాల్య వివాహాల నిరోధక చట్టం, గర్భస్త పిండ లింగ నిర్ధారణ నివారణ చట్టాలపై, యుక్తవయస్సు పిల్లలకు అవగాహన కల్పించారు. వెంకటేష్, ఝాన్సీరాణి, హరీష్‌శంకర్, శ్రీధర్ పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న రైల్వే ఆసుపత్రి వైద్య సిబ్బంది

తప్పులు లేని జాబితా తయారీకి సహకరించండి

రాయదుర్గంరూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటర్ల జాబితా తయారికి రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని ఈఆర్వో రవిశంకర్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని, ఇందుకు తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీని చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్ నాగరాజు, శ్రీనివాసులు, శ్యామ్‌రాయ్, ఈడీటీ సుజాత పాల్గొన్నారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

గుంతకల్లుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ జితేంద్రగౌడ్ గురువారం తెల్లవారుజామున అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అర్చకులు ఆయన పేరట అర్చనలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వాదం చేశారు. గుత్తి పట్టణ అధ్యక్షుడు రవిశంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, క్లస్టర్ ఇన్చార్జి మహమ్మద్ అలీ, రైతు కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు శివారెడ్డి, రామాంజనేయులు, మోహన్‌గౌడ్, తన్వర్ పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకున్న జితేంద్రగౌడ్

భక్తిశ్రద్ధలతో హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో గురువారం ధన్వంతరి హోమాన్ని నిర్వహించారు. అర్చకులు ఆలయంలోని యాగశాలలో స్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం ధన్వంతరి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయంలో 17వ తేదీన హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ కే వాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం


విత్తన కాయలను పంపిణీ చేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నదాతలకు ఎన్డీయే ప్రభుత్వం అండగా నిలిచిందని టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. దేవరపల్లి గ్రామంలో గురువారం రైతులకు రాయితీ విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. ఈ నెలలోనే రైతన్నలకు అన్నదాత సుఖీభవను ప్రభుత్వం అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం రైతులకు విత్తన కాయలు పంపిణీ చేశారు.

ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరాకు అవాంతరాలు?

ఉరవకొండ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో ఇన్వర్టర్ ప్లగ్‌లు తొలగించి ఉండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరాకు అవాంతరాలు కల్గించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలన్న ఉద్దేశంతోనే ఇలా చేశారన్న సందేహాలు వ్యక్త మవుతున్నాయి. ఆసుపత్రిలో ఇన్‌వర్టర్ ప్లగ్‌లు తొలగించిన సంఘటనపైన సీఐ మహానంది విచారణ చేపట్టారు. ఆసుపత్రి సూపరిండెంట్ చౌదరితో ఈ ఘటనపైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎవరెవరు విధుల్లో ఉన్నారని ఆరాతీశారు. క్యాజువాలిటీ గదిలో పేషెంట్లతో పాటు ఎవరు వెళ్లారన్న దానిపైన విచారించారు. ఆసుపత్రితో సంబంధం లేని కొంత మంది సిబ్బంది, బృందం ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు కలుగుతున్నాయి. రోగులకు అసౌకర్యం కలిగించేందుకే ప్లగ్‌లు తొలగించి ఉండవచ్చునని సీఐ తెలిపారు.

చెరకు తోట పరిశీలన


బాధిత రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దవడుగూరు, జూన్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిమాకులపల్లి గ్రామానికి చెందిన రైతు కంబగిరికి చెందిన చెరకు తోటకు గుర్తుతెలియని దుండగులు మూడురోజుల క్రితం నిప్పుపెట్టిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి గురువారం తోటను పరిశీలించారు. అనంతరం రైతును పరామర్శించి ఆర్థికంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యల్లనూరు, జూన్12(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. కోమటికుంట్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాని నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కార్మికుల సమస్యలపై సమ్మె నోటీసు

తాడిపత్రి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేసినట్లు ఏఐసీటీయూ నాయకులు నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల కోసం నోటీసు ఇచ్చామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉమాగౌడ్, శ్రీరాములు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఓగా శ్రీనివాసులు

శెట్టూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఏఓగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. వజ్రకరూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న ఏవోను శెట్టూరు మండల ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా గురువారం విధుల్లోకి చేరారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వుండి సేవలందిస్తామన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

గుంతకల్లుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్ రేష్మా మాట్లాడుతూ కేంద్రంలో మూడు సంవత్సరాల పిల్లల చేత ఓం అనే అక్షరం రాయించి అక్షరా భ్యాసం చేయించామన్నారు. హేమలత, సరోజ, పెద్దక్క, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

యాడికి: పౌష్టికాహారం, ప్రీప్రైమరీవిద్య అంగన్‌వాడీల్లోనే సాధ్యమని ఐసీడీఎస్ తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగం అన్నారు. గురువారం యాడికిలోని సమావేశ భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఎంఈఓ-1 కాశప్ప, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, ప్రభుత్వ వైద్యుడు పరమేశ్వర్ పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం చాలా అత్యవసరమని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. గురువారం మల్లాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు డీ మంజుళబాయి, శోభారాణి, చంద్రకళ పాల్గొన్నారు.


యాడికిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని పలువురు టీడీపీ నాయకులు అన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. ఆయా కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


గుంతకల్లులో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి


శెట్టూరులో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు


ఉడేగోళంలో కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు


కణేకల్లులో..


ఉరవకొండలో...


బ్రహ్మసముద్రంలో

యువకుడిపై బీర్ బాటిల్‌తో దాడి

గుంతకల్లుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేషన్‌రోడ్డు వద్దనున్న వైన్‌షాపులో మధు అనే యువకుడిపై కాలువగడ్డకు చెందిన సుధాకర్ అనే వ్యక్తి గురువారం సాయంత్రం బీర్‌బాటిల్‌తో దాడి చేశాడు. ఆచారమ్మ కొట్టాలకు చెందిన మధు బార్బర్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం స్టేషన్‌రోడ్డులోని వైన్‌షాపులో మద్యం తాగేందుకు వెళ్లాడు. సుధాకర్ అనే వ్యక్తి వచ్చి మధుకు బెగ్గర్లు తాగే మందు తాగుతున్నవా అని అన్నాడు. సరిగ్గా మాట్లాడాలని మధు వారించాడు. దీనిపై ఇరువురూ వాదులాడుకున్నారు. సుధాకర్ పక్కనే ఉన్న బీర్ బాటిల్ తీసుకుని మధు వీపుపై పొడిచి పరారయ్యాడు. స్థానికులు మధును చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

67గొర్రెలు మృతి

పెద్దపప్పూరు, జూన్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఎక్కలూరు గ్రామంలో కంబన్నకు చెందిన గొర్రెలు కడుపు ఉబ్బరంతో 67 గొర్రెలు మృతిచెందాయి. ఆయన తెలిపిన వివరాల మేరకు బుధవారం గొర్రెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం ఇంటి వద్ద కల్లంలో తోలాడు. గురువారం ఉదయం గొర్రెల దగ్గరికి వెళ్లి చూడగా అందులోని 67 గొర్రెలు మృతిచెందినట్లు తెలిపాడు. అనుమానంతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు, పశువైద్యాధికారికి సమాచారం ఇచ్చాడు. కడుపు ఉబ్బరంతోనే గొర్రెలు చనిపోయాయని పశువైద్యాధికారి సుబ్బారెడ్డి తెలియజేశాడు రూ. 5,00,000 నష్టం వాటిల్లిందని గొర్రెలకాపరి వాపోయాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం-6లో 60 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి గురువారం మృతిచెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. ప్లాట్‌ఫాంలోని వెయిటింగ్ హాల్‌వద్ద ఉదయం ఇతను మృతిచెందాడు. ఇతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. వ్యక్తి సహజంగానే మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురిపై ఫిర్యాదు

తాడిపత్రి, జూన్12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో రామాంజనమ్మపై అజిత్, లోకేష్, పవన్, సన్ని దాడిచేసి గాయపరిచారని పోలీసులు తెలిపారు. రామాంజనమ్మకు అజిత్ డబ్బులు ఇవ్వాల్సి ఉండగా ఆమె కొడుకు లోకేష్ డబ్బులు అడిగాడు. ఆ విషయంలో పాతకక్షలు మనసులో పెట్టుకొని అజిత్, లోకేష్, సన్ని, పవన్ రామాంజనమ్మ కొడుకు లోకేష్‌ను దాడి చేయాలని వచ్చారు. ఆ సమయంలో లోకేష్ లేకపోవడంతో తనపై దాడిచేసి గాయపరిచారని ఆమె ఫిర్యాదుచేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.